# మనసు చెప్పిన మాట

అయ్యగారి సుబ్బలక్ష్మి

తల్లి కాత్యాయిని చేతిలోంచి కాఫీ గ్లాసు అందుకుంటూ అడిగాడు మురళి-

''ఏవిటి? నాన్న కట్నం అడుగుతున్నారుట?''

మురళి చిరాకు మొహంలో స్పష్టంగా కనిపిస్తూంటే అతని చిరాకుకి కొంచెం విస్మయం పడుతూ.

''కొత్తేముంది?! ఆయన ముందు నుంచీ అంటున్నదేగా - నా కొడుకు బంగారం - ఎవరైనా సరే బంగారాన్ని కొనుక్కోవాలే తప్ప ఊరికే సంపాదించలేరని'' అంది.

''అయితే! కొడుకుని అమ్ముకుంటున్నారా?!'' తీవ్రంగా, రోషంగా అడిగాడు.

కాత్యాయినికి ఏం మాట్లాడాలో తెలియక, మౌనంగా వుండి పోయింది.

మురళి అంతటితో ఊరుకోలేదు. అతనికి వళ్ళు మండిపోతోంది. అందుకే తల్లిని మళ్ళీ రెట్టించాడు.

''బంగారాన్ని ఎంతో అత్యవసరమైతేనే అమ్ముకొంటారు. ఇప్పుడు మీకంత అవసరమేమొచ్చింది?!'' నిలదీస్తున్నట్టుగా అడిగాడు.

కొడుకులో అంత కోపం ఎప్పుడో గాని చూడని కాత్యాయిని కొంచెం బాధపడింది.


''నన్నడిగితే నేనేం చెప్తానురా?! అసలు నా మాటకి ఏనాడైనా చీమంత విలువుందా ఈ ఇంట్లో?!

ఒక్కసారి పొంగే పాల మీద నీళ్ళు చిలకరించినట్లు చల్లబడి పోయాడు మురళి. ''ఏమీ తెలియని అమ్మ దగ్గర ఎగిరితే పాపం! ఆవిడేం చేస్తుంది?'' అనుకున్నాడు. అందుకే కొంచెం నచ్చ చెప్పే ధోరణిలో తన ఆవేదన వెళ్ళబోసుకున్నాడు.

''అది కాదమ్మా! నిన్నగాక మొన్న మనింట్లో ఆడపిల్లకి కట్నం ఇవ్వనంటూ మొండికేసి వాళ్ళని నానా తిప్పలు పెట్టిన పెద్ద మనిషి - ఇవాళ మామయ్య పరిస్థితి తెలిసి కూడా చెట్టెక్కి కూర్చుంటే ఎలా చెప్ప? ఇంత చదువు చదువుకుని వేలకి వేలు సంపాదించుకుంటూ - కట్నం తీసుకుంటున్నానంటే- అవతల దివ్య దృష్టిలో నేను మలకనై పోనూ?!''

''అసలు మీ నాన్నకి నువ్వు దివ్యని చేసుకోడం ఇష్టం లేదు. అందుకే కట్నం అంటూ తిరకాసు పెడుతున్నారు'' అసలు సంగతి చెప్పేసింది కాత్యాయిని.

''ఏమ్మా! ఇష్టం లేకపోవడానికి దివ్యకి ఏం తక్కువైంది?! చక్కగా ఇంటి పట్టున వుండి మిమ్మల్ని ఆపేక్షగా చూసుకుంటూ నా కనుకూలంగా వుంటుంది కదా?! తండ్రి భారం దించిన మంచితనం దివ్యలో మనమీద ఆపేక్ష పెంచుతుంది కదా?!''



"మీ నాన్నకి - ముద్దు ముచ్చట్లన్నీ నీ పెళ్ళిలో జరగాలిట. అవన్నీ మీ మావయ్య చేయించలేదని ఇష్టం లేదుట"

తల్లి చెప్పే విషయాలు వింటూంటే మురళికి మతి పోతున్నట్లుగా వుంది.

"ఏవిటమ్మా?! అసలు ఆ ఆలోచనకి ఏమైనా అర్థం వుందా?! చెల్లి పెళ్ళికి కావాలని చేసుకుంటున్నవాళ్ళకి కట్నం ఏవిటని ఎగ్గొట్టారు. పెళ్ళిలో ఏం ముద్దు ముచ్చట్లు తీర్చారు వాళ్ళకి. ప్రతిదానికి మగపెళ్ళి వారికంటే ముందే గొడవ పెట్టేసుకుని ఆనవాయితీ లేదని ఎగ్గొట్టేసారు. అవన్నీ చెయ్యగలిగిన స్తోమత వుండి కూడా పెళ్ళయ్యాక వాళ్ళని ఎన్నిసార్లు పిలిచారు?! అయినా ఆయన ముద్దు ముచ్చట్లు వాళ్ళు తీర్చడమేమిటమ్మా గతి లేనట్లు! మన సరదాలు మనం తీర్చుకోవాలి కానీ - కావలసినంత ఇస్తాను తీర్చుకోమను"అన్నాడు తండ్రి మనస్తత్వాన్ని మనసులో విదరించుకుంటూ.

"నేను చెపితే వినే మనిషేనా?!" అంది కాత్యాయిని అసహాయంగా.

బయటి నుంచి లోపలికి వస్తున్న తండ్రిని చూసి లేచి తన గదిలోకి వెళ్ళిపోయాడు మురళి. సాధారణంగా అలా ప్రవర్తించని కొడుకు తీరు ఒక్క క్షణంలో అర్థం అయిపోయింది శేషగిరికి.

"అమ్మా - కొడుకులు ఏవిటి మాట్లాడుకుంటున్నారు?" అన్నాడు ఆరాగా.

"ఏం వుంది?" అంటూ సందిగ్ధంగా ఆగిపోయింది.

"ఏమీలేకే?! రుసరుసలాడుతున్నాడు"

"మీరు మా అన్నయ్యని కట్నం అడిగారని..." కాత్యాయిని మాట పూర్తి కాక ముందే బుస్సున లేచాడు శేషగిరి.

"అవును. అడుగుతాను. నేను అడిగే వాడిని, వీడు వద్దనేవాడు. గొప్ప సంఘ సంస్కర్త బయల్దేరాడు" అన్నాడు వెటకారంగా. అంతటితో ఊరుకోక.

"అయినా నాకు తెలియక అడుగుతాను. ఇదే బయటి సంబంధం అయితే మీ అన్నయ్య కట్నం ఇవ్వకుండానే చేసేవాడా?! ఏదో వీడు చేసుకుంటానన్నాడనే గానీ - లక్ష కట్నం ఇచ్చి అన్ని లాంఛనాలతో పెళ్ళి చేసే సంబంధం వస్తుంది" అన్నాడు పెద్దగా కొడుకు వినాలని.

తన గదిలో గుమ్మంలో నిలబడి -

"లక్ష కట్నంతో వచ్చిన కోడలు మిమ్మల్ని మీ అహంకారాన్ని భరిస్తుందా?!" అన్నాడు సౌమ్యంగానే. అయినా రెచ్చిపోయాడు శేషగిరి.

"ఏం?! భరించక ఏం చేస్తుంది?! అంత భరించలేకపోతే పోతుంది" అన్నాడు తీవ్రంగా.

"అదేమైనా గొప్పా?! ఆ కాడికి అసలు పెళ్ళెందుకు చేసుకోడం?!" చిరాగ్గా అన్నాడు.

"ఓహో! అయితే మా నెత్తినెక్కి తొక్కినా నోరు మూసుకుని పడి వుండాలన్న మాట?!"

"ఇవన్నీ అనవసరపు మాటలు కానీ ... మామయ్యని కట్నం ఇమ్మన్నారుటగా?! అదే ఏభై వేలు! ఎక్కడ్నుంచి తెచ్చిస్తాడని అడిగారు?!" అనడిగాడు కొంచెం ధైర్యంగానే.

"అవునురా అడిగాను. ఏం తేరగా కారు, ఇల్లు, ఫర్నిచరు అన్ని హంగులూ తన కూతురు అనుభవిస్తే బాగా కులుకుతాడా!!" అక్కసుగా అన్నాడు.

"ఇవాళంటే మనకీ హంగులన్నీ వచ్చాయి. మొన్న మొన్నటి దాకా మనమూ ఆ పరిస్థితిలో వున్నవాళ్ళమేగా?! అయినా ఇష్టపడి చేసుకునే పెళ్ళికి కట్నం ఏవిటని చెల్లి పెళ్ళికి కట్నం ఇవ్వలేదు కదా? మరి అది మామయ్యకి వర్తించదా?"

కొడుకుని - తినేశాలా చూశాడు శేషగిరి. మురళి అగలా నిలదీసి అడిగేసరికి తల తిరిగిపోయింది. రక్తం బుస బుస పొంగింది.

"నీకూ- వాడికీ పోలికేమిటి రా?! వాడికి మన పిల్లే బంగారం" అన్నాడు గర్వంగా.

"ఎవరి పిల్లలు వాళ్ళకి బంగారాలు, వజ్రాలే!"

మురళి మాట పూర్తి కాకుండానే-

"నేనేదో నీ సుఖం కోసం తాపత్రయపడుతూంటే నువ్వేమిటి వచ్చే లక్ష్మిని వద్దంటావు?!"

"ఎక్కడ్నుంచి తెచ్చి ఇస్తాడు నాన్నా?!"

"ఏట్లోంచి. ఎక్కడ్నుంచి తేస్తే నా కెందుకు? తేలేకపోతే మానేస్తాడు. అయినా నువ్వెళ్ళి ఇవ్వక్కర్లేదని చెప్పొచ్చావుటగా? పెళ్ళనే సరికి నీకు కొమ్ములు వచ్చేసాయి..."

"కొమ్ములు, గొలుసులు నాకేం రాలేదు. కానీ... నాకు దివ్య చాలా నచ్చింది నాన్నా! ఇందులో ఎవరి ప్రోద్బలం లేదు. నేను కోరుకున్న లక్షణాలన్నీ దివ్యలో వున్నాయి. అందుకే నేను పెళ్ళంటూ చేసుకుంటే దివ్యనే చేసుకుంటాను- అదీ కట్నం లేకుండా..."

మురళి మాట్లాడుతూండగానే... శేషగిరి. కొరకొరా కాత్యాయని వైపు చూస్తూ

"ఇదంతా నీ మూలంగానే... మా అన్నయ్య, మా అన్నయ్య అంటూ రెండుసార్లు వెళ్ళగానే కూతుర్ని అంటగట్టేసాడు తెలివిగా..."

"అవును... బావా బావా అంటూ పక్కన కూర్చోబెట్టుకుని గంటల తరబడి పేకాట నేనే ఆడాను"

"మీరు అనవసరంగా అమ్మనేం అనకండి నాన్నా! ఒకళ్ళు చెప్పినట్లు వినడానికి నేనేం చిన్న పిల్లాడినా. నా వ్యక్తిత్వం నాకుంది"

"ఉంది, ఉంది. బోడి వ్యక్తిత్వం... పెళ్ళి కాకముందే నీకు నా మాటంటే ఖాతరు లేకుండా పోతోంది వాళ్ళ వత్తాసు చూసుకుని..."

"నాకు ఎవరి వత్తాసు అక్కర్లేదు. చిన్నప్పట్నుంచి మీ ఇష్టాలన్నీ నా మీద రుద్దితే భరించలేదూ. ఇప్పుడైనా మిమ్మల్ని కాదని నేనేం చేస్తున్నాను. ఏ విషయంలోనైనా కాంప్రమైజు అవుతాను గానీ పెళ్ళి విషయంలో కాదు..." నిక్కచ్చిగా అన్నాడు.

"మొన్న మొన్నటిదాకా బయట సంబంధాలు చూసేవాడివి... ఉన్నట్లుండి ఇలా దివ్యని చేసుకుంటానని కూర్చున్నావేంరా?" అడిగింది కాత్యాయిని కొడుకు ధోరణి అర్థం కానిదానిలా.

"పోయిన నెలలో ప్రసాద్ ఇంటికి వెళ్ళాను చూడు. అప్పుడు వాళ్ళింటి పరిస్థితి నా మనసుని మార్చేసింది. అంకుల్ చన్నితనంలోనే దూరమైనా ఆంటీ ఎంత కష్టపడి- ఇంట్లోంచి బయటకు రాకుండానే పిల్లల్ని ఎంత జాగ్రత్తగా పెంచిందో, ఎన్ని కష్టాలు పడిందో మనకి తెలుసు. ప్రసాద్‌కి మేనరికం ఇవ్వడం కుదరదని వాళ్ళు నిక్కచ్చిగా చెప్పారని ఆంటీ బయట సంబంధం చేసింది. ఆంటీ- ఆ కోడలితో ఎన్ని తిప్పలు పడుతోందో నా కళ్ళారా చూశాను. నేను సంపాదిస్తున్నాను. నాన్న సుఖ పడుతున్నారు. అలాంటి సుఖం నీకూ రావాలి కదమ్మా! బయటి సంబంధం పిల్ల - ఏమో ఎలా వుంటుందో- అదే దివ్య అయితే కొంచెం నీ గురించి ఆలోచిస్తుందని నా ఆశ! అంతే- నాన్నా! మీరు నేను ఎదురు తిరిగానని కాక- సావధానంగా ఆలోచించండి. ఏది ఏమైనా- నేనొక నిర్ణయానికి వచ్చాను. దివ్యని తప్ప మరో అమ్మాయిని నేను చేసుకోను. కాదూ కూడదంటే- నేను గుళ్ళో పెళ్ళి చేసుకుని వేరింటి కాపురం పెడతాను. అంత మాత్రం చేత మిమ్మల్ని చూడనని మాత్రం అనుకోకండి. మీరే నిర్ణయించుకోండి" కుండ బద్దలుకొట్టినట్టు చెప్పేసి బయటికి వెళ్ళిపోయాడు.

శేషగిరి కాత్యాయని వైపు చూస్తూ,

"చూశావా నిన్నటిదాకా పిల్లిలా వుండేవాడు. సంపాదన పెరిగేసరికి వాడి మీద ఆధారపడ్డామని పులిలా మారిపోయాడు" అన్నాడు.

"పిల్లి కాదూ, పులి కాదు వాడు. మీ కొడుకు" అంది గర్వంగా.

తన స్వభావానికి విరుద్ధమైన పరిస్థితి ఎలా జీర్ణించుకోవాలో తెలియని శేషగిరి "మీ ఇష్టం వచ్చినట్లేడవండ"ంటూ బయటికి వెళ్ళిపోయాడు. ●